

సెల్ఫీ వినాయకా..


- ఆంధ్రజ్యోతి పిలుపునకు స్పందించిన ప్రజలు
- ఎకో(పర్యావరణ సహిత) విగ్రహాల వద్ద సెల్ఫీలు దిగి పంపిన భక్తులు, నిర్వాహకులు

(చిత్ర మాలిక మధ్య పేజీల్లో..)

కనకాచారి స్ఫూర్తిని కొనసాగిద్దాం

16 • ప్రొఫెసర్ హరగోపాల్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మహబూబ్‌నగర్
సోమవారం 28, ఆగస్టు 2017, పేజీలు 16



వర్షాలకు హన్వాడ మండలంలో పచ్చగా మారిన మొక్కజొన్న పంట

జిల్లాలో రెండు నెలలుగా ముఖం చాటేసిన వాన.. రెండు రోజులుగా కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వానతో ఎండుతున్న పంటలకు జీవం పోసినట్లవుతుందని అంటున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2.47 లక్షల హెక్టార్లకు గాను 2.60 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. మొక్కజొన్న, పత్తి, జొన్న, కంది, రాగులు తదితర మెట్ట పంటలను వేశారు. జూన్‌లో సాధారణానికి మించి కురిసిన వర్షం ఆ తర్వాత జూలై, ఈ నెల రెండు రోజుల కిందటి వరకు లేకపోవడంతో పంటలు ఎండిపోయాయి. తాజాగా మళ్లీ కురుస్తున్న వానలతో పైర్లు ఊపిరి పీల్చుకుంటున్నాయని రైతులు చెబుతున్నారు. కానీ ఇంకో బలమైన వర్షం కురిస్తేనే పంటలు చేతికొస్తాయని అంటున్నారు. 2

- మహబూబ్‌నగర్,ఆంధ్రజ్యోతి ప్రతినిధి

చిరు జల్లులు చిగురిస్తున్న ఆశలు

- అల్పపీడనంతో జిల్లాలో వర్షం
- వాడుతున్న పంటలకు ఊరట



ఇంకో వాన కురిస్తే మేలు

రెండు రోజుల నుంచి కురుస్తున్న వానలకు వాడుపట్టిన మొక్కజొన్నకు కాస్త జీవం వచ్చింది. కంది పైర్లకు మాత్రం ఈ వాన బాగా మేలు చేస్తుంది. ఇంకో వాన కురిస్తేనే పైర్లు బతుకుతాయి. తొలకరిలో బాగా వానలు పడ్డాక, రెండు నెలల నుంచి సరైన వానల్లేవు. వేసిన పైర్లు ఎండిపోతున్నాయి. ఇప్పుడే నాలుగు చినుకులు పడుతున్నాయి. ఇంకో రెండు రోజులు ఇట్లనే అడప దడపనైనా వాన కురిస్తే పంటలకు మేలు జరుగుతుంది.

- కిష్టయ్య, రైతు, హన్వాడ



జీవం పోసుకుంటున్న కంది పైరు

నదీ జలాల హక్కుల కోసం

నేడు ధర్నాలు

- 14 నియోజకవర్గ కేంద్రాల్లో పూర్తయిన ఏర్పాట్లు
- విజయవంతానికి ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల కార్యాచరణ
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే యోచన



జూరాల ప్రాజెక్టు

2

కృష్ణా జలాల పునఃపంపిణీ

చేపట్టాలి

- ‘ఆంధ్రజ్యోతి’తో సామాజికవేత్త, ప్రొఫెసర్ హరగోపాల్

2



కృష్ణా జలాల కేటాయింపుల్లో పాలమూరుకు శతాబ్దకాలంగా అన్యాయం జరిగిందని, స్వరాష్ట్రం సిద్ధించిన ఈసందర్భంలో జలాల పునఃపంపిణీ చేపట్టి న్యాయం చేయాలని ప్రముఖ సామాజికవేత్త, ప్రొఫెసర్ హరగోపాల్ అంటున్నారు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే ధర్నాల్లో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కృష్ణా జలాల
పునః పంపిణీ చేపట్టాలి

● సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్

(మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కృష్ణా జలాల పునః పంపిణీ చేపట్టాలని ప్రముఖ సామాజికవేత్త, ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

పాలమూరుకు శతాబ్దకాలంగా అన్యాయం..

ఉమ్మడి పాలమూరు జిల్లాకు శతాబ్దకాలంగా అన్యాయం జరిగింది. కృష్ణానదీ జలాల్లో న్యాయమైన వాటా దక్కకపోవడంతో వనరులు లేక పేదలు, కూలీలు, గ్రామీణులు ఉపాధి కోసం వలసలు పోయారు. ఆకలిచావులు, వలస ప్రాంతాల్లో మరణాలు సంభవించాయి. వీటన్నింటినీ సరిదిద్దాలంటే కృష్ణా జలాల్లో పాలమూరుకు సహజమైన, న్యాయబద్ధమైన వాటా ఇవ్వాలి.

పాలమూరు నీటి సమస్యను దేశవ్యాప్తంగా ప్రచారం చేశాం

తెలంగాణ ఉద్యమ సమయంలో పాలమూరు నీటి సమస్యను కూడా దేశవ్యాప్తంగా ప్రచారం చేశాం. రాష్ట్రం వచ్చాక పాలమూరుకు న్యాయం జరుగుతుందని, నదీ జలాల కేటాయింపుల్లో మరీ వెనకబడిన జిల్లాకు ఎక్కువ నీటిని కేటాయిస్తారని, న్యాయబద్ధంగా నీటి పంపిణీ జరుగుతుందని ప్రజలంతా ఆశించారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఆలోచనతో ప్రజల్లో రేకెత్తిన ఆశలు

నీళ్లు పొందడం అసాధ్యమని అనుకుంటున్న సందర్భంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి ఆలోచన జరగడంతో ప్రజల్లోనూ ఆశలు రేకెత్తాయి. తమకూ నీళ్లొస్తాయనే నమ్మకం పెరిగింది. స్వరాష్ట్రం వచ్చాక తప్పనిసరిగా నీటి పంపిణీ జరుగుతుందని విశ్వసించారు.

న్యాయంగా నీటి పంపిణీ జరగడం లేదు

స్వరాష్ట్రం ఏర్పాటయ్యాక మూడేళ్ల అనుభవాలను పరిశీలిస్తే రాష్ట్రంలో నీటి పంపిణీ న్యాయబద్ధంగా, ప్రమాణాల మేరకు జరగడం లేదని అనిపిస్తోంది. వెనుకబాటుతనం, పేదరికం, వర్ష పాతం, కరువు దృష్ట్యా నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. వర్షాభావ ప్రాంతాలకు నదులు అందుబాటులో ఉన్నప్పుడు నది నీటిని అందించడమే తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండదు. ఈ ప్రమాణాలన్నింటినీ పట్టించుకోకుండా తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా నీళ్లను కేటాయిస్తోంది.

అడగకుండా నీళ్లిస్తే ఈ సమస్య వచ్చేది కాదు

రాష్ట్రం వచ్చాక తప్పనిసరిగా న్యాయబద్ధంగా పాలమూరు జిల్లాకు నీటిని ఇస్తారనే విశ్వాసం ఉండేది. రాష్ట్రం వచ్చి మూడేళ్లయినా ఆ సమస్యపై ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం కల్పించలేకపోవడం వల్లే ఇది మళ్లీ ఒక సమస్యగా ముందుకొచ్చింది. కృష్ణా జలాలను పునః పంపిణీ చేయాలనే డిమాండ్ న్యాయమైనది కాబట్టే దాన్ని సాధించుకునేందుకు పాలమూరు ప్రజలు విశ్వాసంతో ముందుకెళుతున్నారు.

పాలమూరుకు ఇప్పుడు న్యాయం జరగకపోతే భవిష్యత్ అంధకారమే

పాలమూరు ప్రజలకు నదీజలాల్లో న్యాయం జరగాల్సి ఉంది. ఈ సందర్భంలో న్యాయమైన వాటా దక్కకపోతే భవిష్యత్ అంధకారం అవుతుంది. న్యాయమైన హక్కుని సాధించుకునేందుకు జిల్లాలోని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, మేధావులంతా కలిసి ఉద్యమించడం సంతోషకరం.

డిండికి నీటి తరలింపుపై చర్చను కొట్టేయడం సరికాదు

మహబూబ్‌నగర్ నుంచి డిండికి నీటిని తరలించే అంశంపై పాలమూరు ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. స్వయంగా అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలే దీనిపై పునరాలోచించాలని సీఎంకు లేఖ రాశారు. ఈ అంశంపై మేం ప్రజలను రెచ్చగొడుతున్నామని ప్రచారం చేయడం సమంజసం కాదు. డిండికి నీటిని తరలించే అంశంపై జరుగుతున్న చర్చ మరింత ఆరోగ్యకరంగా ఉండాలి. వాస్తవాలను వదిలేసి దాన్ని కొట్టేయడం ప్రభుత్వానికి తగదు.

శ్రీశైలం కంటే ముందే పాలమూరుకు నీటిని తీసుకోవాలనే మా అభిప్రాయాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు

పాలమూరు ఎత్తిపోతల పథకానికి శ్రీశైలం నుంచి నీటిని తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూరాల నిండక, జిల్లా నుంచి కిందకు వెళ్లే నీరే అంతదూరం వెళ్లాక తీసుకునే బదులు, ముందే తీసుకోవాలని మేం చెబుతున్నాం. ప్రభుత్వం తప్పుగా అర్థం చేసుకొంది.

ధర్నాలను విజయవంతం చేయాలి

కృష్ణా జలాల్లో పాలమూరుకు న్యాయమైన వాటా దక్కించుకునేందుకు సోమవారం నిర్వహించతలపెట్టిన అఖిలపక్ష ధర్నాలను విజయవంతం చేయాలి. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, ప్రజాస్వామికవాదులు కలిసిరావాలి.

పాలమూరుపై సీఎం వివక్ష

● పాలమూరు-రంగారెడ్డిని రెండు దశల్లో చేపట్టాలి
● నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో అఖిలపక్షం ధర్నా
● హాజరు కానున్న అన్ని రాజకీయ పార్టీ, ప్రజా సంఘాలు, జేపీసీ
● విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డీకే అరుణ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీకే అరుణ

గద్వాల: ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం ఉత్తర తెలంగాణకే ప్రాధాన్యం ఇస్తూ దక్షిణ తెలంగాణ ప్రాంతమైన పాలమూరుపై వివక్ష చూపిస్తున్నారనే భావన ప్రజల్లో ఉందని పీసీసీ ఉపాధ్యక్షురాలు, ఎమ్మెల్యే డీకే అరుణ అన్నారు. ఆదివారం డీకే బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లతో నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును గతంలో డిజైన్ చేసిన ప్రకారం రెండు దశల్లో నిర్మాణ పనులను చేపడితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. జూరాల-1, శ్రీశైలం-2 అనే రెండు దశల కింద ఈ ప్రాజెక్టును చేపట్టాలని డిమాండ్ చేశారు. డిండి ప్రాజెక్టుకు పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి రోజూ అర టీఎంసీ నీటిని ఇచ్చే విధంగా డిజైన్ రూపొందించారని, అలా కాకుండా ఎస్ఎల్‌బీసీ నుంచి సాగునీటిని డిండి ప్రాజెక్టుకు ఇవ్వాలని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అనుసంధానం చేయాలని కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను, అన్‌గోయింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం సత్వరమే పూర్తి చేయాలనే డిమాండ్‌తో ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు, జేపీసీలు ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల ఫేజ్-1 కింద నిర్మాణం చేపడితే నారాయణపేట, కొడంగల్, షాద్‌నగర్ తదితర ప్రాంతాలు, ఫేజ్-2 కింద పాలమూర్-రంగారెడ్డి నిర్మాణం స్థలం మార్పి శ్రీశైలం నుంచి చేపట్టాన్నారు. దీనివల్ల పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కింద భూముల ముంపును నివారించవచ్చన్నారు. ప్రాజెక్టు కింద ముంపునకు గరవుతున్న భూములకు 2013 చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వాలని, భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ చేసి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. విలేకర్ల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, గడ్డం కృష్ణారెడ్డి, నాయకులు బండల వెంకట్రాములు, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, డిటిడిసి నర్సింహులు, బంగి సుదర్శన్ ఉన్నారు.

జోగుళాంబకు బంగారు
నాలుక బహూకరణ

అలంపూర్: ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబదేవి అమ్మవారికి కర్నూలుకు చెందిన నాగచంద్రావతిదేవి అనే భక్తురాలు 15 గ్రాముల బంగారు నాలుకను బహూకరించారు. ఆదివారం ఆమె ఆలయానికి చేరుకుని తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ, గురురాజాకు బంగారు నాలుకను అందజేశారు.


బంగారు నాలుక

వర్షానికి కూలిన ఇళ్లు

మానవపాడు: గద్వాల జిల్లా మానవపాడు మండలం శనివారం అర్ధరాత్రి నుంచి వర్షం విస్తారంగా కురిసింది. ఆయా గ్రామాల్లో చిన్నచిన్న కుంటలు నిండిపోయాయి. వాగులు పొంగిపొర్లాయి. బోరవెల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రెండు ఇళ్లు కూలిపోయాయి. లోతట్టున ఉన్న ఇళ్లలోకి నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమరవాయి, గోకులపాడు గ్రామాల వాగులు బ్రిడ్జిపై నాలుగు అడుగుల మేర నీరు పారింది. గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి.


బోరవెల్లిలో కూలిన సంజమ్మ ఇల్లు

నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలి

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి


లీడర్ వాయిస్



కోడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. యువతకు లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు 3వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీచేశారు. తమ జీవితాలు మారుతాయని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగుల ఆశలపై కేసీఆర్ నీళ్లు చల్లారు. కొల్లాపూర్ తాలుకాలో నిరుపేదలకు 1400 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరైనా ఎక్కడా పనులు పూర్తి కాలేదన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని చెప్పి టీఆర్ఎస్ కార్యకర్తలకే కేటాయించారన్నారు. 12 శాతం మైనార్టీలకు, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతున్నారే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు.

భక్తుల ఇలవేల్పు పెంట్లవెల్లి షిర్డీ సాయిబాబ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబ ఆలయం నిత్య పూజలతో సందడిగా ఉంటుంది. కొల్లాపూర్‌కు వెళ్లే దారిలో దాతల సహకారంతో 2001లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి ప్రతిరోజు బాబ వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్నారు. పెంట్లవెల్లికి చుట్టుపక్కల గ్రామాల్లో షిర్డీ సాయిబాబ ఆలయం లేకపోవడం మూలంగా మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కొల్లాపూర్ నుంచి వచ్చే భక్తులతో ఆలయం కిటకిటలాడుతోంది. గురువారం ప్రత్యేకంగా గణపతికి అభిషేకాలు చేస్తారు. బాబాను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఆలయ ఆవరణలో ఉండే నవగ్రహాలకు పూజలు చేసి దోష నివారణ నుంచి స్వాంతన పొందుతున్నారు. 29 అడుగుల భారీ అభయ ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. ఇక్కడి బాబాను దర్శించుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో ప్రతి సంవత్సరం గురుపౌర్ణమి రోజున బ్రహ్మోత్స వాలు మనంగా నిర్వహిస్తారని ఆలయ పూజారి శివకుమార్ శాస్త్రి, ప్రవీణ్ శాస్త్రిలు తెలిపారు.


షిర్డీ సాయిబాబ ఆలయం, ఆలయంలోని మూల విరాట్

అటవీ భూముల్లో సాగును అడ్డుకున్న అధికారులు

- ట్రాక్టర్ సీజ్
- కేసు నమోదు



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

లింగాల: లింగాల రేంజ్ పరిధిలోని మారెడుమాన్‌దిన్నె సమీపంలోని అటవీ భూములను కొందరు అక్రమంగా సాగు చేస్తుండగా ఆదివారం ఎఫ్‌ఆర్వో చంద్రమౌళి ఆధ్వర్యంలో అధికారులు అడ్డుకున్నారు. ఎఫ్‌ఆర్వో వివరాల మేరకు మారెడుమాన్ దిన్నెకు చెందిన తెలుగు కురుమయ్య దాదాపు 4 ఎకరాల అటవీ భూమిని ట్రాక్టర్‌తో దున్నతున్నారనే సమాచారాన్ని తెలుసుకొని అక్కడికి వెళ్ళి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అటవీ భూములను సాగుచేస్తే అటవీ సంరక్షణ చట్టం కింద చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సెక్షన్ అధికారి పద్మారావ తదితరులు ఉన్నారు.

డబుల్.. ట్రబుల్

- జిల్లాలో పడకేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం
- పలు చోట్ల టెండర్ల దశలోనే
- మూడేళ్లలో ఒకే ఒక్క ఇంటి నిర్మాణం పూర్తి



కొల్లాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు (పాత చిత్రం)

ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం జిల్లాలో పడకేసింది. మూడేళ్లు కావస్తున్నా ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం ఇటు లబ్ధిదారులను, అటు ప్రజాప్రతినిధులను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తోంది. డబుల్ బెడ్ రూం ఇళ్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్న పేదల ఆశలు ఆవిరవుతున్నాయి. ఏడాదిన్నర వ్యవధిలో ఎన్నికల్లోకి వెళ్లాల్సిన పరిస్థితుల్లో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణంపై అనేక ఆశలు పెట్టుకున్న ప్రజాప్రతినిధులు ఈ అంశం ఇంకా కొలిక్కి రాకపోవడంపై అసహనంతో ఉన్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. అసలే గృహ నిర్మాణ రంగంలో పెరిగిన వ్యయంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకురాని పరిస్థితి ఉండగా తాజాగా జీఎస్టీ కూడా తోడు కావడం అశనిపాతంగా మారింది.

మూడేళ్లలో ఒకే ఒక్క ఇంటి నిర్మాణం

జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని 20 మండలాలు, 300 గ్రామపంచాయతీల పరిధిలో కేవలం ఒకే ఒక్క డబుల్‌బెడ్ రూం ఇంటి నిర్మాణం పూర్తి చేయడం ప్రజలను నైరాశ్యానికి గురి చేస్తుంది. అచ్చంపేట నియోజకవర్గం ఐనోల్‌లో హరితహారం కార్యక్రమం నిర్వహిస్తుండగా ట్రాక్టర్ కింద పడి పాఠశాల విద్యార్థిని మృతి చెందింది. ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు డబుల్ బెడ్ రూం ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఆ ఒక్కటి తప్ప మూడేళ్లలో ఎలాంటి ప్రగతిని సాధించకపోవడం గమనార్హం. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అనేక సందర్భాల్లో టెండ ర్లు పిలిచినప్పటికి ప్రభుత్వం రూపొందించిన డిజైన్‌కు అనుగుణంగా నిర్మా ణం చేపట్టకపోవడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి కనబర్చకపోవడంతో టెండర్ల దశలోనే పనులు ఆగిపోతున్నాయి. సిమెంట్, స్టీల్, ఇటుక ధరలు గణనీయంగా పెరగడంతో పాటు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీని అమలు చేయడంతో బెంబేలెత్తుతున్న కాంట్రాక్టర్లు టెండర్ల జోలికి వెళ్లాలంటేనే జంకుతున్నారు.

జిల్లాలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్,

రియల్‌బూమ్‌తో ఇక్కట్లు

కల్వకుర్తి పట్టణాలు నగరపంచాయతీలుగా ఉన్నాయి. ఇక్కడ డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణానికి స్థలాల లభ్యత ప్రధాన సమస్యగా మారింది. పట్టణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ కూడా విపరీతంగా ఉండడం భూసేకరణకు అవరోధంగా మారింది. దీని పర్యవసానంగా అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల్లో రెండు పడకల ఇళ్ల నిర్మాణం స్థల పరిశీలిన దశలోనే ఉండడం గమనార్హం.

కొల్లాపూర్‌లో శంకుస్థాపన

మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత నియోజకవర్గం కొల్లాపూర్‌లో మూడేళ్ల తర్వాత వారం రోజుల క్రితం డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. నియోజకవర్గానికి 1,400 ఇళ్లు మంజూరు కాగా కేవలం 400 ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మాత్రమే టెండర్లు పూర్తి కావడం గమనార్హం. అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేకపోవడం ఆందోళనకు గురి చేస్తుంది. అచ్చంపేటలో మొదట 400 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా నగరపంచాయతీ ఎన్నికల సమయంలో అదనంగా మరో 1000 ఇండ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అయినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కల్వకుర్తి నియోజకవరంలో కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారయ్యింది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా పనులు ప్రారంభించాల్సి ఉంది.

తలనొప్పిగా లబ్ధిదారుల ఎంపిక

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పనుల ప్రారంభం సంగతి దేవుడెరుగు. లబ్ధిదారుల ఎంపిక మాత్రం ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులకు తలనొప్పి వ్యవహారంగా పరిణమించింది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంశంపై గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చాలా విస్తృతమైన స్థాయిలో ప్రచారం జరిగింది. దీంతో సహజంగానే పేద ప్రజలు డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కలల ప్రపంచంలో విహరించారు. ఇళ్ల నిర్మాణానికి పునాదిరాయి పడితే చాలు మాకు కూడా ఇల్లు వస్తుందనే బలమైన నమ్మకంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి చాలా పరిమితమైన సంఖ్యలో మాత్రమే ఇళ్లు కేటాయించడం సమస్యగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో కనీసం గ్రామానికి పది ఇండ్లు కేటాయించాలన్నా దాదాపు 12 నుంచి 15వందల ఇళ్లు అవసరమవుతాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అర్బన్, రూరల్ ఏరియాలను విభజించి వేర్వేరుగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని యోచిస్తుండడంతో అందరిని సర్దుబాటు చేయలేక ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఎవరినీ దూరం చేసుకునే పరిస్థితి లేక అల్లాడుతున్నారు.

అంతరించి పోతున్న కళలను కాపాడాలి

- తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పల్లె నర్సింహా

నాగర్‌కర్నూల్ టౌన్: తెలంగాణ రాష్ట్రంలో అంతరించి పోతున్న ప్రజా కళలపు రక్షించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పల్లె నర్సింహా డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా నాట్యమండలి జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సాంస్కృతిక విధానాన్ని అమలు చేసి జిల్లా, రాష్ట్ర సాంస్కృతిక మండళ్ళను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అంతరించి పోతున్న జానపద, యక్షగాన, వీధి నాటక, ఒగ్గుకథ ఔత్సాహిక కళలకు జీవం పోసి కాపాడాలని కోరారు. ప్రతి జిల్లాలో ఓపెన్ ఆడిటోరి యాలు ప్రదర్శనలకు అనుకూలంగా ఏర్పాటు చేయాలని, అన్ని నియోజకవర్గాలలో మినీ రవీంద్రభారతిలు నిర్మించాలన్నారు. సంఖ్యతో నిమిత్తం లేకుండా అర్హులైన పేద, వృద్ధ కళాకారు లకు పెన్షన్ ను ఇవ్వాలని, క్రీడారంగానికి ఇచ్చే ప్రాధాన్యత కళారంగానికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలం గాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌నర్సింహ, కళాకారులు నర్సింహా, విజయుడు, సంతోష్, శ్రీను, రవీందర్, ఈశ్వర్, మల్లయ్య, వెంకటయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్‌లో విజిలెన్స్ తనిఖీలు

- రికార్డుల పరిశీలన
- ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలుపై విచారణ
- విద్యార్థుల సంక్షేమంపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్ : జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో విజిలెన్స్ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఆవిర్భావ సమయంలో కేటాయించిన నిధులు, వాటి వినియోగంపై రికార్డులను పరిశీలించారు. జిల్లా మైనారీ సంక్షేమాధికారి సప్తగిరి ఇటీవల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌కు గుడ్లు, చికెన్ సరఫరా చేసే కాంట్రాక్టర్లతో బార్‌లో మందు పార్టీలు చేసుకున్న విషయం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. టెండర్లు పిలవకుండా రెసిడెన్షియల్ స్కూల్‌లో ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలులో కూడా ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో గులాం హుస్సేన్ ఆధ్వర్యంలోని విజిలెన్స్ అధికారుల బృందం ఆదివారం మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసింది. రికార్డులను స్వాధీనం చేసుకోవడంతో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా, ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలు విషయంలో కూడా ఎలాంటి విధానాన్ని అవలంబించారనే అంశంపై కూడా వారు ఆధారాలను సేకరించారు.

మైనార్టీ సంక్షేమాధికారికి షోకాజ్ నోటీసు

మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లకు కోడిగుడ్లు, చికెన్ సరఫరా చేసే కాంట్రాక్టర్లతో కలిసి జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సప్తగిరి మందు పార్టీ చేసుకున్న సంఘటనపై జిల్లా కలెక్టర్ ఇ.శ్రీధర్ సీరియస్‌గా ప్రతిస్పందించారు. దీనిపై ఎందుకు చర్య తీసుకోకూడదో వివరించాలని ఆదేశిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో పూర్తి స్థాయి వివరాలు సమర్పించాలని, లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని నోటీసులో హెచ్చరించారు.

సాగునీటి పోరుకు సై..

- జిల్లావ్యాప్తంగా నేడు ఆందోళనలు
- బీజేపీ మినహా ఏకమైన రాజకీయ పక్షాలు

ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్: సాగునీటి విషయంలో జిల్లాకు అన్యాయం జరుగుతుందటూ ప్రధాన రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు ఉద్యమ బాట పట్టాయి. కృష్ణాజలాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ప్రధానమైన వాటా దక్కాలని డిమాండ్ చేయడంతో పాటు పాలమూరు రంగారెడ్డితో సహా పెండింగ్ ప్రాజెక్టులపై కూడా రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాల నేతలు గళం విప్పనున్నారు. బీజేపీ మినహా కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, ఎమ్‌ఐఎమ్, న్యూడెమోక్రసీ, వాటి అనుబంధ సంఘాలతో పాటు తెలంగాణ జేఏసీ, పాలమూరు అధ్యయన వేదికతో పాటు దాదాపు 20 ప్రధాన పక్షాలు ఒకే వేదిక ఏర్పాటు చేసుకొని పోరుకు సై అంటున్నాయి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఫేజ్1, ఫేజ్2గా విభజించి ఫేజ్1లో జూరాల నుండి పడమటి మహబూబ్‌నగర్ జిల్లా ఆయకట్టుకు సాగునీరందించాలని, రెండో దశ ఫేజ్2లో శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను వినియోగించుకోవాలని చాలా కాలంగా జేఏసీ, పాలమూరు అధ్యయన వేదికలు తమ వాదనను వినిపిస్తున్న విషయం తెలిసిందే దీనికి తోడు నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్ల మధ్య నుండి డిండికి నీటిని తరలించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా వివాదస్పదంగా మారింది.



వెల్దండజేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి

దీన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే ఆందోళనలు కూడా జరుగుతన్నాయి. డిండికి నాగర్జున సాగర్ ద్వారా నీటిని తరలించాలని నార్లాపూర్, ఏదుల నుంచి కృష్ణాజలాలను తరలిస్తే ప్రజలు పెద్దఎత్తున నిర్వాసితులుగా మారతారని, ఇందుకు ఏకతాటిపై నిలిచి ఉద్యమించాలని కోరుతున్నారు. చివరి దశలో ఉన్న ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయడంతో పాటు చంద్రసాగర్ వద్ద అమ్రాబాద్ తుమ్మన్‌పేట నుంచి బల్మూర్‌కు కొత్తగా ఎత్తిపోతల పథకాలను కూడా నిర్మించాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవచారి డిమాండ్ చేశారు.

మహాధర్నాను విజయవంతం చేద్దాం

వెల్దండ: పార్టీలు, జెండాలు, అజెండాలను పక్కకుపెట్టి నియోజకవర్గ ప్రయోజనాలకు కేఎల్ఐ సాగునీటికై ప్రతిఒక్కరూ ఉద్యమించాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వెల్దండ గ్రామ పంచాయతీ ఆవరణలో కేఎల్ఐ సాగునీటికై సోమవారం కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా విజయవంతం చేసేందుకు నిర్వహించిన జేఏసీ సమావేశంలో కిష్టారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తైక్వాండా పోటీలు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో రీజియన్ స్థాయి తైక్వాండో పోటీలు రెండో రోజు కొనసాగాయి. మూడు రోజుల పాటు వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో పోటీలు నిర్వహిస్తున్నారు. హైద్రాబాద్ రీజియన్ పరిధిలోని పాండిచ్చేరి, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన 152 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని పలువురు సూచించారు. వట్టెం జవహర్ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మహ్మాద్ అజీజ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

తెలుగు గంగపుత్రులను బీసీ ఏలో చేర్చాలి

- అసిస్టెంట్ ప్రొఫెసర్ గాలెన్న
- సీడ్ ఫారం చెరువులను ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ గాలెన్న

సింగోటం(కొల్లాపూర్ రూరల్): తెలుగుగంగ పుత్రులను బీసీ-ఏలో చేర్చాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ గాలెన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సింగోటం శ్రీవారి సముద్రం సమీపంలో తాలుకాస్థాయి తెలుగు గంగపుత్రుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గాలెన్న మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా తెలుగుగంగ పుత్రులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రిజర్వేషన్ల ఫలాలను ఉపయోగించుకునే స్థితిలో లేరని, ఇందుకు వారు చదువులో, ఉద్యోగాల్లో వెనుకబడటమే కారణం అన్నారు. నోటిఫైడ్ చెరువుల్లో సీడ్ ఫారాలు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు రుణసౌకర్యం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, చెరువుల వద్ద కమ్యూనిటీ సమావేశ మందిరాలను నిర్మించాలన్నారు. సంక్షేమం కోసం ఏటా 1000 కోట్లతో బడ్జెట్‌ను ఇవ్వాలన్నారు. 50 ఏళ్లు దాటిన వారికి రూ.3 వేల పించన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు గంగపుత్ర సంఘ నాయకులు జలకం మద్దిలేటి, వెంకటస్వామి, రామకృష్ణ, రాముడు, పిట్టల ఈదన్న, సదుర్గ పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక కమిటీ ఎన్నిక : కొల్లాపూర్ తాలుకా తెలుగు గంగపుత్ర మత్స్య పారిశ్రామిక కమిటీని అస్టెంట్ ప్రొఫెసర్ గాలెన్న సమక్షంలో ఆదివారం మండలంలోని సింగోటం శ్రీవారి సముద్రం వద్ద ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు పెబ్బేటి కృష్ణయ్య, అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యాక్షులు మల్లయ్య, మధు, కోశాధికారి నరసింహలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజయానికి ఐదు సూత్రాలు

- ప్రముఖ సైకాలజిస్ట్ లక్ష్మణ్



సైకాలజిస్ట్ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ నాయకులు

అచ్చంపేట: విజయానికి పోటీ ప్రపంచంలో పాత్రికేయుల పాత్ర అనే అంశంపై ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి అష్టాదశ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో అచ్చంపేట తాలుకా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ సైకాలజిస్టు లక్ష్మణ్ అచ్చంపేట నియోజకవర్గంలోని దాదాపు 200 మంది జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తి విజయానికి ఐదు సూత్రాలు దోహదం చేస్తాయన్నారు. ప్రతి మనిషి తాను కష్టపడింది తాను తినాలి తప్ప ఇతరుల కష్టాన్ని దోచుకోవడం వల్ల నష్టమే కలుగుతుందన్నారు. ప్రతి మనిషి వివిధ రంగాల్లో ఉంటారని, ఆయా రంగాల్లో పట్టులేకపోతే రాణించడం కష్టమవుతుందని వివరించారు. ప్రధానంగా ముందు మనల్ని మనం నమ్ముకున్నప్పుడే ఏదైనా విజయం సాధిస్తామన్నారు. వీటన్నింటికి ప్రధానంగా కుటుంబ సహకారం ఎంతో అవసరమన్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న సామెత అందులో నుంచి పుట్టుకొచ్చిందన్నారు. ప్రతి మనిషి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని

లక్ష్మణ్‌కు ఘన సన్మానం

ప్రపంచ స్థాయిలో ఈ ప్రాంతానికి గుర్తింపు తెస్తు సైకాలజిస్ట్ లక్ష్మణ్‌ను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చందు, ప్రధాన కార్యదర్శి రవి, ప్రకాష్, కోశాధికారి రాజులతో పాటు మండల కన్వీనర్‌లు సాయిబాబు, చెన్నయ్య, నిరంజన్, శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు రావుఫ్, పెనిమిళ్ళ వెంకట్ ఘనంగా సన్మానించారు.



దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్ లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సంచారజాతులకు న్యాయం

- బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయులుగౌడ్



ఆంజనేయులుగౌడ్‌కు తోలు బొమ్మలను అందిస్తున్న వివిధ సంచారజాతుల వారు

గద్వాలటౌన్: పుట్టుకతోనే కళానైపుణ్యం సొంతం చేసుకున్న సంచార జాతులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆంజనేయులుగౌడ్ హామీ ఇచ్చారు. సంచార జాతుల విముక్త దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనం వద్ద సంచారజాతుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో 11కోట్ల మంది జనాభా ఉన్న సంచారజాతులకు తగిన న్యాయం జరిగేలా బాలకృష్ణ సిద్ధంరేణు కమిషన్ చేసిన సిఫార్సులు ఏళ్లు గడుస్తున్నా అమలుకాకపోవడం సంచారజాతులకు శాపంగా మారిందన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్రంలో 3.20వేల మంది గుడిసెల్లో నివసిస్తున్నారని, 9లక్షల కుటుంబాలకు కనీసం భూమి లేదని తేలిన నేపథ్యంలో వారి అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి తక్షణ స్పందన చూపారన్నారు. కనీసం గుర్తింపు కూడా లేని కులాలకు న్యాయం జరిగేలా, ఆయా కులాలు గురించి అధ్యయనం చేసేందుకు బీసీ కమిషన్‌కు ఆయన ఆదేశాలు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 20కులాలు ఏ జాబితాలో లేవని, వారంతా సంచార జాతుల వారేనని పేర్కొన్నారు. బ్రాహ్మణిజాన్ని, ఆధిపత్య ధోరణిలను ప్రశ్నించిన శైవమతం ప్రచారాన్ని నిర్వహించే సంచార జాతులు, చరిత్రను వర్తమానానికి అందించే నిజమైన కళాకారులన్నారు. సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనారాయణ మాట్లాడుతూ సంచార జాతుల వారికి 200సంవత్సరాలుగా అన్యాయం జరుగుతోందన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, పొన్నాల కుమార్, ఇన్ చార్జి చెన్నయ్య, డాక్టర్ కళాదాసరి రంగ, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధసంచార జాతుల వారు తమ స్థితిగతులను వివరిస్తూ ప్రభుత్వపరంగా సహాయం అందజేయాలని, కుల జాబితాల్లో చోటు కల్పించాలని బీసీ కమిషన్‌సభ్యుడు ఆంజనేయులుగౌడ్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

'పేద రెడ్ల సంక్షేమానికి కృషి చేస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

వెల్దండ : సమాజ సేవలో పాలమూరు రెడ్డి సేవాసమితికి ప్రత్యేక స్థానం ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు అన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం తోడేటి చెన్నారెడ్డి గార్డెన్‌లో పాలమూరు రెడ్డిసేవా సమితి నియోజకవర్గస్థాయి సమావేశం తాలూకా అధ్యక్షుడు తలసాని లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరగ్గా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది రెడ్డి కులస్థులు ఆర్థికంగా లేని పరిస్థితుల్లో బాధలను తమలోనే దిగమింగుకుని బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్డి కులస్తులకు కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేసేందుకు ప్రభుత్వం ఈబీసీ సర్టిఫికెట్లు ఇవ్వకూడదని మెలిక పెట్టిందని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చించి సానుకూలంగా జీవో వచ్చేలా కృషిచేస్తామని పేర్కొన్నారు. వెయ్యి కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో నిర్మించే రెడ్డిసేవాసమితి కమ్యూనిటీ భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇతర దేశాల్లో స్థిరపడ్డ వారు పేదరెడ్డి కులస్తులను ఆదుకోవాలని కోరారు. రెడ్డి కులస్తులకు కల్యాణలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. ప్రతి రెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని నారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ ఛైర్మన్ విజితారెడ్డి, ఎంపీపీ రామేశ్వరమ్మ, జిల్లా, తాలూకా నాయకులు సత్యనారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, పావనిరెడ్డి, వసంతరెడ్డి, బండెల రాంచంద్రారెడ్డి, డాక్టర్ హరికాంత్, శ్రీలత, మాధవరెడ్డి, ఎమ్మె ల్యే సతీమణి అశ్లేషారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు .

రెండు తలల దూడ జననం

కొత్తకోట: ఓ గేదెకు రెండు తలల దూడ పుట్టిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అప్పరాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన రైతు సత్యారెడ్డి గేదెకు రెండు తలల దూడ పుట్టిందన్న విషయం గ్రామస్థులకు తెలియడంతో గుంపులుగా వచ్చి చూశారు. కొంతసేపటి తర్వాత దూడ మృతి చెందింది. జన్యులోపం కారణంగా రెండు తలల దూడ జన్మించిందని పశువుల డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.



రెండు తలల దూడ కళేబరం

చవితి వేడుకల్లో ప్రమాదం

- మండపం వద్ద విద్యుదాఘాతంతో ఆరుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన రాఘవ

ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్ :వినాయక చవితి వేడుకల్లో ప్రమాదం చోటు చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తూడుకుర్తిలో గణేష్ మండపంలో విద్యుదాఘాతానికి గురై ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణేష్ మండపంవద్ద ఇనుప స్తంభానికి గ్రీస్ రుద్ది (జారుడు స్తంభం) ఆట నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో పొడవైన ఇనుప స్తంభాన్ని భూమిలో పాతుతుండగా పొరపాటున 11కేవీ వైర్లకు తగిలింది. దీంతో స్తంభాన్ని ఎత్తుతున్నవారంతా విద్యుదాఘాతానికి గురై పడిపోయారు. గ్రామస్థులు 108లో వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాఘవ పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని మహబూబ్‌నగర్‌కు తరలించారు. గాయపడిన సిద్ధు, శివకుమార్, రాజ్‌కుమార్, కురుమూర్తి, రవిలకు నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్

- అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్ టౌన్: ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభమవుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 100, 800 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ నాలుగు విభాగాల్లో అండర్-14, 16, 18 స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడారులకు భోజన వసతి ఉంటుందని మంగళవారం ఉదయం 8గంటలకు మైదానానికి చేరుకొని నిర్వాహకులకు రిపోర్టు చేయాలని సూచించారు. గెలుపొందిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి దుర్గం కృష్ణప్రసాద్‌గౌడ్, డీఈఓ కార్యాలయ ఈఓ శ్రీధర్, లింగాల ఎంపీపీ మంజుల పాల్గొన్నారు.

మంగళవారం నాటి పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని డీఈఓ జనార్దన్‌రావు ఆదేశానుసారం వారు సోమవారం ఉదయం 9గంటలకు పైకా భవనం నందు రిపోర్టు చేయాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి దుర్గం ప్రసాద్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

బస్సు ఢీ: 9 గొర్రెల మృతి

మానవపాడు : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం బోరవెల్లి స్టేజి సమీపంలో రోడ్డు పక్కన మేస్తున్న గొర్రెలపైకి బస్సు దూసుకెళ్లడంతో 9 గొర్రెలు మృతి చెందాయి. బాధితులు, స్థానికుల కథనం మేరకు మానవపాడుకు చెందిన శ్రీనివాసులు, రాముడులకు ప్రభుత్వ సబ్సిడీ కింద గొర్రెలు వచ్చాయి. మేపుకెళ్లి జాతీయ రహదారి వెంట వస్తుండగా కర్నూ లు నుంచి గద్వాల వైపు వెళ్తున్న బస్సు అతి వేగంగా గొర్రెలపైకి దూసుకెళ్లింది. దీంతో 9 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 గొర్రెలు గాయపడినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



గొర్రెల కళేబరాలు

మహాధర్నాను విజయవంతం చేయండి

కల్వకుర్తి అర్బన్ : పట్టణంలో సోమవారం తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అఖిలపక్ష నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. నల్గొండ జిల్లాకు అక్రమంగా సాగునీరు తరలిస్తే సహించే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

చంద్రబండ తండాలో విషజ్వరాలు తగ్గుముఖం

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండ తండాలో విషజ్వరాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు వారం రోజుల నుంచి తండాలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది గిరిజనులకు వైద్య సేవలందిస్తున్నారు. దీంతో జ్వరాలు అదుపులోకి వచ్చాయి. ఆదివారం ఆంధ్రజ్యోతి తండాను సందర్శించి జ్వరాలతో బాధపడుతున్న వారిని పలుకరించింది. కేతావాత్ లక్ష్మి(70) అనే వృద్ధురాలు, సంధ్యన అనే చిన్నారి మరికొందరు సాధారణ జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుసుకున్నారు. తండాలో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి రోగులకు మందులు అందజేస్తున్నారు. మలేరియా



జ్వరంతో బాధపడుతున్న వృద్ధురాలు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

సబ్ యూనిట్ అధికారి రామ్మోహన్ సూపర్‌వైజర్ బాలాజీసింగ్, హెల్త్ అసిస్టెంట్ ఓంకార్, ఏఎన్ఎం ఇంటింటికీ తిరిగి దోమల నివారణకు మందును స్ప్రే చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

కుడికిళ్ల ఎస్సీ కాలనీకి విద్యుత్ వెలుగులు



కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న వార్డు సభ్యులు

కొల్లాపూర్ రూరల్: కుడికిళ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీకి విద్యుత్ వెలుగులు వచ్చాయి. 30 ఏళ్ల నుంచి కాలనీలో వీధిలైట్లు లేక కాలనీవాసులు రాత్రిళ్లు అంధకారంలో మగ్గారు. ఇక్కడ 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాలనీవాసులు సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్లినా ఫలితంలేదు. చివరకు గ్రామ నాయకుల ఒత్తిడితో విద్యుత్ శాఖ అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసి కరెంట్ తీగలు లాగారు. ఆదివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, వార్డు సభ్యులు కుబేరుడు, వెంకటేశ్వరావు, శివానందం, బాలయ్య, శ్రీను, కురుమయ్య, పవన్ శెట్టి, నాగరాజు, రఘుపతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోడేరులో ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయకుడిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న గ్రామస్థులు

కోడేరు: కోడేరుతో పాటు వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వాడవాడలో కొలువుదీరిన గణనాథులను యువకులు మూడ్రోజుల పాటు విశేష పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం యువకులు గణపతి బప్పా మోరియా అంటూ ఊరేగింపు నిర్వహించి గణనాథుల నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో శివ, నరేష్, శ్రీను పాల్గొన్నారు.

చురుగ్గా సోమశిల కాటేజీ నిర్మాణం

● పరిశీలించిన టీఆర్ఎస్ నాయకులు



పనులు పరిశీలిస్తున్న టీఆర్ఎస్ నాయకుడు నరసింహారావు

